## హరిహర క్షేత్రంలో కార్తీక మాసోత్సవాలు

**మూసాపేట:** భరత్‌నగర్‌ కాలనీలోని హరిహర క్షేత్రంలో కార్తీక మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్‌ నాగిరెడ్డి తెలిపారు. నవంబర్‌ 2 నుంచి డిసెంబర్‌ ఒకటవ తేదీ వరకు ఆలయ అర్చకులు కృష్ణసూరి సమక్షంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబర్‌ 4వ తేదీ మొదటి సోమవారం రోజు శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు, 10వ తేదీన దాసాంజనేయ స్వామికి లక్ష తమలపాకుల అర్చన, 11న రెండో సోమవారం సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 15వ తేదీన కార్తీక పౌర్ణమి సందర్భంగా శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు, సత్యనారాయణస్వామి వ్రతం, సాయంత్రం లక్ష దీపారాధన, 19వ తేదీన అర్థోత్సవం, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, లక్ష బిల్వార్చన, సాయంత్రం 6 గంటలకు సంకష్ట హరి చతుర్థి సందర్భంగా లక్ష్మీ గణపతికి పంచామృతాభిషేకం, 25న నాలుగో సోమవారం ప్రత్యేక అభిషేకం, త్రయోదశి సందర్భంగా సాయంత్రం నందీశ్వరునికి అభిషేకం, 29న మాస శివరాత్రి సందర్భంగా కాశీ విశాలాక్షి విశ్వేశ్వర స్వామి కళ్యాణం, వన భోజనాలు, 30న స్వామివారిని భరత్‌ నగర్‌ కాలనీ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## కూరగాయల ధరలు..

**సనత్‌నగర్‌:** ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో రూపాయల్లో..) టమాటా.35, నల్లవంకాయ 45, పొడుగు వంకాయ 35, బెండకాయ 65, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 70, క్యాప్సికమ్‌ 75, పచ్చకాకర 45, పందిరి బీర 55, క్యాబేజీ 23, క్యారెట్‌ 55, దొండ 45, గుండుబీన్స్‌ 100, గింజ చిక్కుడు 100, గోకరకాయ 55, కీర 31, దోసకాయ 40, బీట్‌రూట్‌ 35, ఉల్లిగడ్డ 40, ఆలుగడ్డ 36, చామగడ్డ 37, మొరంగడ్డ 23, కందగడ్డ 65, సొరకాయ 17, పొట్లకాయ 23, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

## భర్తపై భార్య బ్లేడుతో దాడి

- ఫోన్‌లో ఎక్కువ మాట్లాడుతున్నందుకు నిలదీసిన భర్త..

**అమీర్‌పేట:** ఫోన్‌లో తరచూ ఎవరితో మాట్లాడుతున్నావని అడిగినందుకు ఆగ్రహంతో భార్య భర్తపై బ్లేడుతో దాడికి పాల్పడింది. ఎస్‌ఆర్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. బల్కంపేటకు చెందిన చదల శివ (45), విజయ (38)కు 23 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి 20 ఏళ్ల వయసున్న కూతురు, 17 సంవత్సరాల కుమారుడు ఉన్నాడు. అయితే ఇటీవల విజయ వేరొకరితో ఫోన్లో ఎక్కువగా మాట్లాడుతున్నట్లు శివ గుర్తించాడు.ఈ నెల 26వ తేదీన రాత్రి కూడా భర్త ఇంట్లో ఉన్న సమయంలోనే భార్య వేరొకరితో ఫోన్లో మాట్లాడుతుండటంతో అనుమానించి శివ నిలదీశాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో షేవింగ్‌ బ్లేడ్‌తో భర్తపై విజయ దాడి చేసింది. తీవ్ర గాయమై రక్త స్రావం జరగడంతో స్థానికులు శివను ఆసుపత్రికి తరలించారు.ఆదివారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతన్నారు.



# రోడ్లు ఇలా.. ఇంకెన్నాళ్లు!

- అధికారుల మధ్య సమన్వయ లోపం.. అభివృద్ధి పనుల్లో జాప్యం
- రహదారులను తవ్వేసి.. ఆ తర్వాత వదిలేస్తున్న వైనం



అధికారుల తీరు మారదు.. రోడ్లు మరమ్మతుకు నోచుకోవు. అభివృద్ధి పేరిట అంతర్గత రహదారులు తవ్వుతారు. పని పూర్తి అయిన తరువాత మరమ్మతులు చేయకుండానే వదిలేస్తారు. జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారుల మధ్య సమన్వయలోపంతో అభివృద్ధి నత్తనడకన సాగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచినీరు, డ్రైనేజీ పైపులైన్‌లు వేసిన అనంతరం ఈ అంతర్గత రహదారుల్లో సీసీ రోడ్లు వేయవలసిన అధికారులు అలసత్వం కారణంగా రోడ్లపై చిన్నారులు, వృద్ధులు నడవలేని పరిస్థితి నెలకొంటున్నది. ఆల్విన్‌కాలనీ డివిజన్‌ సాయినగర్‌లోని సాయిబాబా ఆలయం రోడ్డులో డ్రైనేజీ, మంచినీటి పైపులైన్‌ పనులు చేసి సుమారు 6 నెలలు కావస్తోంది. ఇప్పటికీ అక్కడ సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. దీంతో వాహనదారులు, స్కూలుకు వెళ్లే చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. సాయిబాబా ఆలయం రహదారిలో నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. దీంతో పాటు ఆలయానికి సమీపంలో ఉన్న రహదారులు కూడా అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ కోసం రోడ్లను తవ్వి పైపులైన్‌ పూర్తి చేసి నెలలు గడుస్తున్నా వాటికి ప్యాచ్‌ వర్కులు చేయలేదు. దీంతో కంకర తేలుతున్న రహదారులపై సర్కస్‌ ఫీట్లు వేయాల్సి వస్తోందని వాహనదారులు పేర్కొంటున్నారు. రహదారులను తవ్వినప్పుడే జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయంతో పనులు పూర్తి చేయాలని, వెంటనే ప్యాచ్‌ వర్కులు కానీ, నూతన సీసీ రోడ్లు కానీ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. –ఆల్విన్‌కాలనీ



అస్తవ్యస్తంగా ఉన్న ఆల్విన్‌కాలనీ డివిజన్‌ సాయినగర్‌లోని సాయిబాబా ఆలయం అంతర్గత రోడ్డు

## నేడు శివరామాంజనేయ ఆలయంలో పూజలు

**మోతీనగర్‌:** మూసాపేట డివిజన్‌ కబీర్‌నగర్‌ ఎక్స్‌టెన్షన్‌ అవంతినగర్‌లోని శ్రీ శివ రామాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామివారికి ఉదయం 8.30 గంటలకు మంగళవారం పంచామృతాభిషేకం, మహా మంగళహారతి నిర్వహించనున్నారు. కాల సర్పదోషం, నాగదోషం, కుజ దోషం నివృత్తి, వివాహం, సంతానం కోసం సుబ్రహ్మణ్య స్వామి వారి అభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు.

## పరామర్శ



పుష్పరెడ్డిని పరామర్శించిన బండి రమేష్‌

**కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకురాలు, వ్యవసాయ మార్కెట్‌ కమిటీ చైర్‌పర్సన్‌ పుష్పరెడ్డిని కూకట్‌పల్లి కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌ సోమవారం పరామర్శించారు. పుష్పరెడ్డికి ఇటీవల మోకాళ్లకు శస్త్ర చికిత్స జరిగింది. దీంతో బండి రమేష్‌ బాలానగర్‌లోని ఆమె నివాసంలో కలసి పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు నాగిరెడ్డి, దినేష్‌ కుమార్‌, శ్రీకాంత్‌పటేల్‌, యుగంధర్‌, అస్లాం, అరుణ్‌, నయీమ్‌, కిట్టు, మధు, అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాంత్‌ పటేల్‌కు జేఎన్‌టీయూ పీహెచ్‌డీ ప్రదానం



అప్పాల శ్రీకాంత్‌

**కేపీహెచ్‌బీకాలనీ:** అప్పాల శ్రీకాంత్‌ పటేల్‌కి జేఎన్‌టీయూలో పీహెచ్‌డీ ప్రదానం చేశారు. తెలంగాణ ఉద్యమం సమయంలో కీలకపాత్ర పోషించిన విద్యార్థి నాయకుడు శ్రీకాంత్‌ పటేల్‌కి ఎన్విరాన్‌మెంటల్‌ సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ విభాగంలో పరిశోధనలకుగాను యూనివర్సిటీ అధికారులు సోమవారం డాక్టరేట్‌ పట్టాను అందజేశారు. 2012లో ఆయన పీహెచ్‌డీలో చేరారు. అయితే తెలంగాణ ఉద్యమం సమయంలో ఎన్నో అడ్డంకులు ఎదుర్కొని పట్టుదల, కృషితో విద్యను పూర్తి చేశారని శ్రీకాంత్‌ పటేల్‌ గైడ్‌ డాక్టర్‌ ప్రమోద్‌కుమార్‌ తెలిపారు. శ్రీకాంత్‌ పటేల్‌ మాట్లాడుతూ డాక్టరేట్‌ తన చిన్నప్పటి కల అని అన్నారు.

## ఆలయంలో ఎమ్మెల్యే మాధవరం పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం, కార్పొరేటర్‌ రవీందర్‌ రెడ్డి తదితరులు

**బాలానగర్‌:** బాలానగర్‌ డివిజన్‌ పరిధిలోని సాయి నగర్‌ శ్రీ సాయి నాగేంద్రాలయంలో శ్రీధన్వంతరి స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ, స్వామివారి సామూహిక కల్యాణంలో సోమవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్‌ ఆవుల రవీందర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాలయ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ అంబటి సునీల్‌, దేవాలయ నిర్మాణం, విగ్రహ దాత, పి.త్రికోటేశ్వరరావు, మందడి సుధాకర్‌ రెడ్డి, బొట్టు విష్ణు, దేవులపల్లి కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, రంగంపేట్‌ శ్రీనివాస్‌ ముదిరాజ్‌, బాజని నాగేందర్‌గౌడ్‌, ప్రేమ్‌కుమార్‌, యం.సుధాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రికి శుభాకాంక్షలు



పొంగులేటిని కలసి శుభాకాంక్షలు తెలుపుతున్న యాదగిరి

**ఓల్డ్‌ బోయిన్‌పల్లి:** రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌ రెడ్డి జన్మదినం సందర్భంగా ఓల్డ్‌ బోయిన్‌పల్లి డివిజన్‌ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం మంత్రి నివాసంలో పీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి ఆధ్వర్యంలో డివిజన్‌ కాంగ్రెస్‌ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునయాదవ్‌, సీనియర్‌ నేత షాయిన్‌షా తదితరులు మంత్రిని కలిశారు.

**జన్మదిన శుభాకాంక్షలు**

**కూకట్‌పల్లి:** రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి కూకట్‌పల్లి యువ నాయకుడు గాదె శివచౌదరి సోమవారం పూలబొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇరిగేషన్‌ చైర్మన్‌ మువ్వ విజయబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కేక్‌ కట్‌ చేశారు. ఈ సందర్భంగా ఆయనపై రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బచ్చు మల్లి, హరిప్రసాద్‌ నాయుడు , రమణ, నాగ, వాలి, బి బ్లాక్‌ అధ్యక్షురాలు సంధ్య, సీనియర్‌ నాయకులు గోవింద్‌ గౌడ్‌, ఉపేంద్రరెడ్డి, శ్రీనివాస్‌ కుమార్‌, రామకృష్ణ, నరేష్‌ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి పొంగులేటికి శుభాకాంక్షలు తెలిపిన గాదె శివచౌదరి

## జన్మదిన శుభాకాంక్షలు



రజనీకాంత్‌ జన్మదిన వేడుకల్లో బండి రమేష్‌, నాయకులు

**కూకట్‌పల్లి:** మూసాపేటకు చెందిన కాంగ్రెస్‌ సీనియర్‌ నేత తూము రజనీకాంత్‌ జన్మదిన వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి కాంగ్రెస్‌ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌ ముఖ్యఅతిథిగా హాజరై కేక్‌ కట్‌ చేయించి, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి పలువురు పార్టీ నాయకులు హాజరయ్యారు.

## ఎలక్ట్రిక్‌ వాహనాలు అందజేత

**గచ్చిబౌలి:** ఉపాధి కల్పనలో డిక్కీ తెలంగాణ చాప్టర్‌ చేపడుతున్న చర్యలు భేష్‌ అని ఎస్‌బీఐ డీజీఎం రోహిత్‌ కుమార్‌ పేర్కొన్నారు. సోమవారం కొండాపూర్‌లోని ఏ.ఎస్‌బీఐ గచ్చిబౌలి, డిక్కీ తెలంగాణ చాప్టర్‌ ఆధ్వర్యంలో నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ యువతకు ఎలక్ట్రిక్‌ వాహనాలు అందజేశారు. ఈ సందర్భంగా డీజీఎం మాట్లాడుతూ 20 మంది నిరుద్యోగ యువతకు ఎలక్ట్రిక్‌ వాహనాలు అందించామని అందులో 8 మంది మహిళలు కూడా ఉన్నారని తెలిపారు. డిక్కీ తెలంగాణ చాప్టర్‌ ప్రెసిడెంట్‌ దాసరి అరుణ, కోఆర్డినేటర్‌ దాసరి నారాయణ మాట్లాడుతూ ఓహెచ్‌ఎమ్‌ కార్ల కంపెనీలో ఐదేళ్ల ఒప్పందం ప్రకారం రాబోయే రోజుల్లో 100 వాహనాలు మహిళలకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఏజీఎం వెంకటనారాయణ, సోమశేఖర్‌, ప్రవీణ్‌ కుమార్‌, అజయ్‌ రామ్‌,ప్రకాష్‌ పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

**మియాపూర్‌:** నిర్మాణంలో ఉన్న భవనంలో కరెంట్‌షాక్‌ తగలడంతో మూడవ అంతస్తు నుండి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ కె. క్రాంతికుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. జనగాం జిల్లా తరిగొప్పులకు చెందిన శివరాత్రి యాదగిరి(45) బతుకుదెరువు కోసం 7 సంవత్సరాల క్రిందట నగరానికి వచ్చి జగద్గిరిగుట్టలో కుటుంబంతో నివాసముంటున్నాడు. భవన నిర్మాణాల్లో క్రేన్‌ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో కరెంట్‌ షాక్‌ తగలడంతో మూడవ అంతస్తు పై నుండి కిందఉన్న ఇటుకలపై పడడంతో తీవ్ర గాయాలై యాదగిరి అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న మృతుడి కుటుంబ సభ్యులు భవనం వద్దకు చేరుకుని తమకు న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

## ప్రధానరోడ్డులో సంత వద్దు

- జీహెచ్‌ఎంసీ అధికారుల ఆదేశాలు
- పొట్టకొట్టొద్దంటున్న కూరగాయల వ్యాపారులు
- ఖాజాగూడలో సంత నిర్వహణకు స్థలం చూపాలని స్థానికుల డిమాండ్‌



ఖాజాగూడ ప్రధాన రోడ్డు పక్కన సంత (ఫైల్‌)

**రాయదుర్గం:** నేడు ఆన్‌లైన్‌ ఆర్డర్లు పెరిగినా సంతల ప్రాముఖ్యత తగ్గలేదు. ఏళ్లుగా గచ్చిబౌలి డివిజన్‌ ఖాజాగూడలో ప్రధాన రహదారి పక్కన మంగళవారం సంత జరుగుతుంది. ఇటీవల జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రధానరోడ్డులో సంత నిర్వహించరాదంటూ ఆదేశాలు జారీ చేయడంతో నేడు మంగళవారం సంత నిర్వహించాలా ?వద్దా..? తర్జనభర్జన జరుగుతోంది. ప్రతి మంగళవారం ఉదయం పది గంటల నుంచి కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, ఇతర వస్తువులు, దుస్తులు రకరకాలను అందుబాటులో ఉంచడంతో పేద, సామాన్య మధ్యతరగతి వారే కాకుండా ఉద్యోగులు, అపార్ట్‌మెంట్లు, గేటెడ్‌ కమ్యూనిటీవాసులు సైతం ఈ సంతలకు వస్తున్నారు. కాగా సంతను కొనసాగించాలని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులను నియమించాలని స్థానికులు కోరుతున్నారు. అంతేకాకుండా సంత నిర్వహణకు అనువైన చోటును కేటాయించా లని కూరగాయల వ్యాపారులు, స్థానికులు డిమాండ్‌ చేస్తున్నారు. ప్రస్తుతం ఖాజాగూడలో అంతర్గత రోడ్లపై సంతను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్‌ చేస్తున్నారు.

## ప్రధాన ఉపాధ్యాయ సంఘాలను బహిష్కరించండి

**ఉస్మానియా యూనివర్సిటీ:** రాష్ట్రంలోని ప్రధాన ఉపాధ్యాయ సంఘాలు టి.పీఆర్‌టీయూ, యూటీఎస్‌, టీజీ పీఆర్‌టీయూలను బహిష్కరించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్‌ టీచర్లకు విజ్ఞప్తి చేశారు. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న టీచర్స్‌ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అన్ని సంఘాల నాయకులు గత కొన్ని సంవత్సరాలుగా బీసీ, ఇతర వర్గాలను టీచర్లను విస్మరిస్తూ అగ్రకుల అభ్యర్థులనే పోటి చేయిస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఆయా సంఘాల్లో 80 శాతం టీచర్లు బడుగు బలహీన వర్గాలు చెందిన వారైనప్పటికీ ఎవరికి అవకాశం ఇవ్వకుండ వరుసగా అగ్రకులానికి చెందిన టీచర్లకు పోటీ పోటీచేసే అవకాశం ఇవ్వడం ఉపాధ్యాయాల సంఘాల నియంతృత్వానికి నిదర్శనం అన్నారు. పీఆర్‌టీయూ అభ్యర్థిగా పింగళి.శ్రీపాల్‌ రెడ్డి, యూటీఎఫ్‌ నుంచి నర్సిరెడ్డి, టి.పీఆర్‌టీయూ నుంచి హర్షవర్ధన్‌ రెడ్డి పేర్లను ఆయా సంఘాలు ప్రకటించడం వారి ఆధిపత్య వైఖరికి నిదర్శనమన్నారు. బీసీ టీచర్లు ఆయా సంఘాల నుంచి బీసీ అభ్యర్థినీ పోటీలో నిలిపి ప్రధాన ఉపాధ్యాయ సంఘాలకు బుద్ధి చెప్పాలని జాజుల లింగంగౌడ్‌ ఎస్సీ, ఎస్టీ, బీసీ టీచర్లకు విజ్ఞప్తి చేశారు.

## అవినీతి నిర్మూలనలో ముందుండాలి

**సనత్‌నగర్‌:** సనత్‌నగర్‌లోని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆడిటోరియంలో సోమవారం ఉద్యోగులచే 'కల్చర్‌ ఆఫ్‌ ఇంటిగ్రిటీ ఫర్‌ నేషన్స్‌ ప్రాస్పెరిటీ'పై ప్రతిజ్ఞ చేయించారు. టీజీపీసీబీ సభ్య కార్యదర్శి రవి హాజరై వారిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఉద్యోగులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు విధి నిర్వహణలో పారదర్శకంగా, నిజాయతీగా ఉండాలని పిలుపునిచ్చారు. అవినీతి నిర్మూలనలో పీసీబీ ఉద్యోగులు ముందుండాలన్నారు. విజిలెన్స్‌ అవేర్‌నెస్‌ వీక్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సమాచార హక్కు చట్టం 2025 నిబంధనల అమలు తీరుపై సమీక్షించారు. ఆర్టీఐ అధికారుల గురించి తాజా సమాచారాన్ని పోర్టల్‌లో ఉంచాలని ఆదేశించారు. టీజీపీసీబీలో మొత్తం 13 మంది అధికారుల పేర్లను ప్రదర్శించాలని సూచించారు.

## కాలనీల్లో హాస్టళ్లు వద్దు



శ్రీరాంనగర్‌ కాలనీవాసుల ధర్నా

**గచ్చిబౌలి:** పీజీ హాస్టళ్లను నిషేధించాలని డిమాండ్‌ చేస్తూ శ్రీరాంనగర్‌ కాలనీ ఏ బ్లాక్‌ కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం కాలనీ అధ్యక్షుడు శివకుమార్‌ ఆధ్వర్యంలో ప్లకార్డులతో ధర్నా చేశారు. ఈ సందర్భంగా శివకుమార్‌ మాట్లాడుతూ పీజీ హాస్టళ్ల వల్ల వ్యర్థాలు డ్రైనేజీలో చేరిపోవడంతో ఎక్కడికక్కడ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఒక్కో హాస్టల్‌లో వందల సంఖ్యలో విద్యార్థులు ఉండటంతో నీరు సరిపోవడం లేదని, పార్కింగ్‌ వసతి లేకపోవడంతో ట్రాఫిక్‌ సమస్య నెలకొని వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కల్గుతున్నాయన్నారు. ఇళ్లను హాస్టళ్లకు అద్దెకు ఇవ్వవద్దని వారు యజమానులకు సూచించారు.పైగా రాత్రి సమయంలో మద్యం తాగి న్యూసెన్స్‌ చేస్తున్నారని పోలీసులకు, జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేడిశెట్టి రాము, విజయలక్ష్మి, వాణి, శ్రీదేవి, మాధవి, దేవిక, చంద్రమౌళి, తిరుపతి, నర్సింహారెడ్డి భాస్కర్‌రావు పాల్గొన్నారు.

## టీకన్సల్ట్‌–స్త్రైపుల్‌ ఎంఓయూ

**రాయదుర్గం:** ప్రపంచవ్యాప్తంగా హెచ్‌ఆర్‌ సొల్యూషన్‌లను మార్చడానికి టీ హబ్‌ ప్రాంగణంలో సోమవారం స్త్రైపుల్‌–టీకన్సల్ట్‌ మధ్య ఒప్పందం కుదిరింది. టీకన్సల్ట్‌ చైర్మన్‌ సందీప్‌ మక్తాల, స్త్రైపుల్‌ సంస్థ సీఈఓ వెంకట్‌ బూరా ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా చిన్న, మధ్య తరహా వ్యాపారాల కోసం ఏఐ ఆధారిత హెచ్‌ఆర్‌ పరిష్కారాలను అందించడం ఈ భాగస్వామ్యం లక్ష్యం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కంపెనీలకు అధునాతన హెచ్‌ఆర్‌ పరిష్కారాలను తీసుకు రావాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. స్త్రైపుల్‌ మార్కెటింగ్‌ హెడ్‌ షేక్‌ జిలానీ, ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ గౌతమ్‌, టీకన్సల్ట్‌ నుంచి ఈశ్వర్‌, రాజీవ్‌ రావులపాటి, వంశీ, నరేందర్‌ పాల్గొన్నారు.

## విద్యుత్‌ సిబ్బంది ప్రతిజ్ఞ



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించిన ఏడీఈ మాణిక్యాలు

**కూకట్‌పల్లి:** విజిలెన్స్‌ అవేర్‌నెస్‌ వారోత్సవాల్లో భాగంగా కూకట్‌పల్లి హౌసింగ్‌ బోర్డు విద్యుత్‌ సబ్‌ డివిజన్‌ ఏడీఈ బి.మాణిక్యాలు సిబ్బందితో డివిజన్‌ కార్యాలయం ఎదుట సోమవారం ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సబ్‌ డివిజన్‌ ఏఈలు విజయ్‌ ప్రకాష్‌, భీమప్ప, విజిలెన్స్‌ కానిస్టేబుల్‌ ఆంజనేయులు, కేపీహెచ్‌బీ బాలానగర్‌ సెక్షన్‌ విద్యుత్‌ సిబ్బంది పాల్గొన్నారు.

## విధుల్లో చేరిన కొత్త అసిస్టెంట్‌ ఇంజనీర్లు

**చందానగర్‌:** జీహెచ్‌ఎంసీ చందానగర్‌ సర్కిల్‌ 21లోని ఇంజనీరింగ్‌ విభాగంలో కొత్తగా ముగ్గురు అసిస్టెంట్‌ ఇంజనీర్లు సంతోష్‌, పావని, మన్నెం నాయక్‌ సోమవారం విధుల్లో చేరారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్న ఇంజనీర్లు పబ్లిక్‌ హెల్త్‌ విభాగం నుంచి వచ్చి చేరారు. ఇప్పటి వరకు సర్కిల్‌ 21లో ముగ్గురు ఏఈలు ఉండగా మరో ముగ్గురు రావడంతో అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెడతామని ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

## నేషనల్‌ సైన్స్‌ ఫెయిర్‌లో 'మనూ' మోడల్‌ స్కూల్‌ విద్యార్థులు

**రాయదుర్గం:** జాతీయ సైన్స్‌ ఫెయిర్‌లో మనూ మోడల్‌ స్కూల్‌ విద్యార్థులు రాణించారు. చెన్నయ్‌లోని పూనమిల్లిలోని నవా మోడల్‌ స్కూల్‌లో నిర్వహించిన 17వ జాతీయ సైన్స్‌ ఫెయిర్‌లో 'మనూ' మోడల్‌ స్కూల్‌ మూడవ స్థానంలో నిలిచింది. సాదియా బేగం, మీర్జీ జోయాబేగంలు లైఫ్‌ సైన్సెస్‌ విభాగంలో 'వరి, గోధుమ విత్తనాల అంకురోత్పత్తి, విత్తనాల పారామితులపై యూవీ–సి రేడియేషన్‌ ప్రభావం' అనే అంశంపై ప్రాజెక్టును సమర్పించారు.ఈ సందర్భంగా వారికి మెమెంటో, ప్రశంసాపత్రాన్ని అందించారు.

## 108, 102 అంబులెన్స్‌ల తనిఖీ

**గచ్చిబౌలి:** కొండాపూర్‌లోని జిల్లా ఆస్పత్రిలోని 108, 102 నియోనేటర్‌ అంబులెన్స్‌లను 108 రంగారెడ్డి జిల్లా మేనేజర్‌ శ్రీకాంత్‌ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరంతరం అందుబాటులో ఉండటమే కాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అంబులెన్స్‌లలో ఆక్సిజన్‌ సరఫరా, రికార్డులను ఆయన పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈఎంటీ రాంబాబు, జావీద్‌, కుమారస్వామి, పైలెట్‌ శివ, ప్రణయ్‌, ఖలీల్‌, గోపాల్‌ పాల్గొన్నారు.



రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేకంగా ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న సాఫ్ట్‌లైన్‌ అడ్వర్టైజింగ్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ సీఎండీ సత్య చన్నూరి.